క్లుప్తంగా

129 మందికి వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో సోమవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 129 మందికి వైద్యురాలు అష్రఫ్ వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా గర్భిణులకు రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు తప్పనిసరిగా పాలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. వైద్య శిబిరంలో ఇచ్చిన ఐరన్ మాత్రలు వేసుకుంటూ తగిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత లేకుండా చూసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎల్‌సీడీసీ సర్వే



ఫిరంగిపురం: నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి.. పరీక్షలు చేశారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చెవులు, మెడ, చాతీపై నొప్పిలేని బుడిపెలు గుర్తించడం, కనురెప్పలు మూత పడకపోవడం, ముక్కుదిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం, కాళ్లు చేతులు తిమ్మిర్లుగా ఉండటం, చేతుల నుంచి వస్తువులు జారి పోవడం వంటి లక్షణాలను గుర్తించి వాటిని సంబంధిత యాప్‌లో నమోదు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన షేక్ గౌస్ బాషాకు రూ.9.24లక్షల సీఎం సహాయ నిధి నగదు చెక్కును సోమవారం టీడీపీ నాయకులు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాషాకు నగదు రావడానికి కృషి చేసిన మంత్రి లోకేష్‌కు అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరి జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరులో ప్రధాన రహదారి వెంబడి ఓ వ్యక్తి మృతి చెంది పడి ఉండటాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. గమనించి దుగ్గిరాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై కాషాయ రంగు దుస్తులు ఉండడంతో యాచకుడు అయి ఉంటాడని భావిస్తున్నారు.

కానిస్టేబుల్‌పై దాడి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాశం బ్యారేజ్ వద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై మద్యం మత్తులో ఓ యువకుడు సోమవారం సాయంత్రం దాడికి పాల్పడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం మహానాడుకు చెందిన మణికంఠ అనే యువకుడు మద్యం తాగి రోడ్డుపై వచ్చిపోయే వాహనాలకు అడ్డు పడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కర్నూలు 6వ బెటాలియన్ కానిస్టేబుల్ సతీష్ అతడ్ని పక్కకు వెళ్లమని చెప్పాడు. దీంతో అతను కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డాడు. మణికంఠను తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. స్టేషన్‌లో అతను ప్రశాంతంగా నిద్రపోయాడు.

కాపర్ వైర్లు చోరీ



కాకుమాను:పంప్ హౌస్‌లో కాపర్ వైర్ చోరీకి గురైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది.పెదనందిపాడు మండలం పాత మద్రాసు రోడ్డులోని వరగాని,అ బ్బినేనిగుంట పాలెం గ్రామాల మధ్య మల్లాయపాలెం మేజర్ కాలువపై ఉన్న పంపుహౌస్ ఉంది. ఫ్యూజ్ బాక్స్‌లో కాపర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి అపహరణకు గురైన ఫ్యూజ్‌బాక్సును పరిశీలించి, స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహానాడులో మాయగాడు దొరికాడు

- రెండు నెలల వ్యవధిలో ఐదు ఇళ్లల్లో చోరీ
- దొంగ.. పాత నేరస్తుడు షేక్ హుస్సేన్ అలియాస్ బెగ్గర్
- అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరుపరిచిన పోలీసులు
- 82 గ్రాముల బంగారం ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ రవికుమార్



షేక్ హుస్సేన్ అరెస్ట్ చూపిస్తున్న లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ రవికుమార్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో 66 రోజుల్లో 5 ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లల్లో చోరీలు జరిగాయి. బంగారం, వెండి ఇతర విలువైన వస్తువులను దోచుకుని తమకు కంటిమీద కునుకు లేకుండా చేసిన పాత నేరస్తుడిని ఎట్టకేలకు తాడేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం కోర్టుకు హాజరు పరిచారు. ఈ కేసుకు సంబంధించి లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ వివరాలు వెల్లడించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు కరకట్ట నివాసితుడు షేక్ హుస్సేన్ ఎలియాస్ బెగ్గర్ జల్సాలకు, వ్యసనాలకు బానిసయ్యాడు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గతేడాది డిసెంబరు 20న మహానాడు 21వ రోడ్డులో కె.సునీత అనే మహిళ 50 గ్రాముల బంగారం దొంగిలించాడు. మరుసటి రోజే 16వ లైన్‌లో కె. శ్రీనివాసులు అనే వ్యక్తి ఇంటిలో 3.980 గ్రాముల బంగారం, 31న 10వ లైన్‌లో కె.ప్రసాద్ ఇంటిలో 18.020 గ్రాముల బంగారం, జనవరి 4న 6వ లైన్‌లో ఎం.కరుణాకర్ ఇంటిలో 4.020 గ్రాముల బంగారం, 70 గ్రాముల వెండి, జనవరి 16న 13వ లైన్‌లో వి.రమేష్‌కుమార్ ఇంటిలో 6 గ్రాముల బంగారం, రూ.25 వేల నగదు చోరీ చేశాడు. చోరీ చేసిన బంగారాన్ని హుస్సేన్.. మహానాడు మణిపాల్ హాస్పిటల్ వద్ద ఒక వ్యక్తికి అమ్ముతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని 82.02 గ్రాముల బంగారం, 70 గ్రాముల వెండి, రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును చేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ అభినందనలు తెలిపినట్లు చెప్పారు. ఈ సమావేశంలో తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిర్యాదు ఒకటి... కేసు మరొకటి

తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన దొంగతనాల్లో బాధితుల వర్షన్ మరోలా ఉంది. తాము ఒకలా ఫిర్యాదు ఇస్తే.. మరోలా ఫిర్యాదును పోలీసులు నమోదు చేస్తున్నారని చెబుతున్నారు. అది కూడా ఫిర్యాదు చేసిన కొంతకాలం తర్వాత మళ్లీ మరల ఫిర్యాదు తీసుకుని కేసులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం స్తున్నారు. ముద్దాయి ఎస్కే హుస్సేన్ పాత నేరస్తుడే. దీంతో పోలీసులు అతనిపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో మంగళగిరి పట్టణానికి చెందిన ఓ బంగారు వ్యాపారస్తుడికి దొంగిలించిన బంగారం మొత్తం అమ్మినట్లు విశ్వసనీయ సమాచారం. తాడేపల్లికి సంబంధించిన ఓ కానిస్టేబుల్‌కు మంగళగిరి సబ్ డివిజన్‌లోని పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేసిన సమయంలో సదరు బంగారం వ్యాపారితో పరిచయం ఏర్పడిందని, అతని నుంచి కొంత రికవరీ చేసి, మరికొంత బంగారానికి సంబంధించి బేరసారాలు ఆడినట్లు ఆరోపణలొస్తున్నాయి.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: విద్యార్థులు సృజనాత్మకత వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో పాఠశాలలో సోమవారం వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిలోనూ ఏదో ఒక సృజనాత్మకత దాగి ఉంటుందని తెలిపారు. దానిని గుర్తించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. తెలుగు భాషను అభివృద్ధి పరిచేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన చైనీస్ పజిల్, హైడ్రోజన్ ట్రైన్, మెట్రో ట్రైన్, రాత్రి పగలు ఏ విధంగా తిరుగుతాయనే తెలియజేసే పరికరం ఈ ప్రదర్శలో ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. సుమారు 500 మంది విద్యార్థులు ఎక్స్‌పోలో తమ నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాన్ బాస్కో పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ చినబాబు, రెవరండ్ ఫాదర్ జోస్, ఫాదర్ మర్రెడ్డి, ఫాదర్ జోసఫ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోలాకు ఘన నివాళి



కోలా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఇందిరా నగర్‌లో ఇటీవల మృతి చెందిన సీపీఐ నాయకుడు కోలా సీతారామయ్య సంస్మరణ సభ సోమవారం కార్యదర్శి ఉడత శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు గంగా అజయ్‌కుమార్ కోలా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోలా సీతారామయ్య పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేశారని, ఇందిరానగర్ కాలనీ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. వారి ఆశయ సాధనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా కోలా సీతారామయ్యకు సన్మానం చేసిన చిత్రపట జ్ఞాపికను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి నాగేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, కోలా వీరాంజనేయులు, తుడిమెళ్ళ వెంకటయ్య, చిన్ని సత్యనారాయణ, గండికోట దుర్గారావు, పంతగాని మరియబాబు, గోలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ విస్తృత పర్యటన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్, నగరపాలక సంస్థ సిబ్బంది

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా అధికారులతో కలసి సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. నగరంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా పనిచేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇస్తున్నారా లేదా అని ఆరా తీయాలన్నారు. సమన్వయంతో అధికారులు పనిచేసి సంపూర్ణ పారిశుద్ధ్య నగరంగా తీర్చిదిద్దాలని సూచించారు. నగర పరిధిలోని బాపనయ్య నగర్ శిబిరం, ఎస్సీ కమ్యూనిటీ హాల్స్‌ను ఆయన పరిశీలించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులు పరిష్కరించాలని వారికి ఆదేశించారు. నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



పొక్లెయిన్‌తో అక్రమ కట్టడాల కూల్చివేత

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణంలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను సోమవారం అధికారులు తొలగించారు. నగరపరిధిలోని సర్వే నంబరు 134లో రత్నాల చెరువు ప్రాంతంలో ఆక్రమణలు జరిగినట్లు నగరపాలక సిబ్బంది గుర్తించారు. పలువురు ఆక్రమించుకుని ప్రహరీలు, బేస్‌మెంట్లు నిర్మాణం చేశారు. సదరు ఆక్రమణలను గుర్తించిన నగరపాలక సంస్థ సిబ్బంది అధికారుల ఆదేశాల మేరకు పొక్లెయిన్ సాయంతో ఆక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ ఆక్రమణల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే నగరపాలక సంస్థ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. చెరువులు, నీటి గుంటలు, ప్రభుత్వ భూములు కావాల్సిన ఆవశ్యకత ఉందని, ఈ విషయంలో అధికారులు, సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక సిబ్బంది, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ అధికారులు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, డిప్యూటీ సిటీ ప్లానర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించండి

ఎమ్మెల్యే శ్రావణ్‌కు ఇంజినీరింగ్ అసిస్టెంట్ల వినతి



ఎమ్మెల్యే శ్రవణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

మేడికొండూరు: గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ ఉద్యోగంలో చేరి ఐదేళ్లు దాటినా ఇప్పటికీ పదోన్నతులు కల్పించలేదని తాడికొండ సబ్ డివిజన్ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సచివాలయ వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను ప్రభుత్వం క్షుణ్ణంగా అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌కి ఉద్యోగ నియమాలతో పాటు త్వరలో ఉద్యోగోన్నతులు కూడా కూటమి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి పనుల్లో కీలకమైన ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ యూనియన్ డైరీ, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. స్టేట్ జాయింట్ సెక్రెటరీ జె.నాగరాజు, జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ షేక్ ఘన్ సైదా, జనరల్ సెక్రెటరీ బి.జాన్ వెస్లీ, టెక్నికల్ సెక్రెటరీ ఎస్.ప్రణీత్ బాబు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కేటాయించాలి



ఫిరంగిపురం: మాదిగ సామాజిక వర్గానికి ప్రత్యేక శ్మశాన స్థలం కేటాయించాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. పొనుగుపాడు గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం మాదిగ కాలనీలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారి దృష్టికి వచ్చిన పలు అంశాలు తెలియజేశారు. ఉపాధి హామీ వేతనాలు ప్రతి వారం ఇవ్వడం లేదని చెప్పారు. ప్రతి రోజు రూ.200 మించి కూలి పడటం లేదని పేర్కొన్నారు. పనిముట్లు, కొత్తవారికి జాబ్ కార్డులు, మెడికల్ కిట్లు ఇవ్వడం లేదని తెలిపారు. సర్వేలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సీఐటీయూ నాయకులు షేక్ మస్తాన్‌వలి, కె.కోటేశ్వరరావు, కె.రమేష్, కె.కోటేశ్వరరావు, కె. వెంగళరావు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కృష్ణానది ఎగువ ప్రాంతంలో ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఎత్తిపోతల పథకం వద్ద గల్లంతైన యువకుడి కోసం మంగళగిరి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలించి, మృతదేహాన్ని సోమవారం వెలికి తీసింది. తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు మాట్లాడుతూ విజయవాడ, వన్‌టౌన్‌కు చెందిన చాట్ల బాలు (18) తన స్నేహితులతో కలసి ఈతకు వచ్చాడని తెలిపారు. కృష్ణానదిలో కాలుజారి పడిపోయాడని చెప్పారు. ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు సమాచారం ఇవ్వడంతో ఉదయం 6 గంటల నుంచి గాలింపు చర్యలు చేపట్టగా మధ్యాహ్నం ఒంటి గంటకు మృతదేహం లభించిందని వెల్లడించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఆయన తెలిపారు. బాలు మృతిచెందడంతో బంధువులతో పాటు స్నేహితులు శోక సముద్రంలో మునిగిపోయారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందాడని తండ్రి అప్పలరెడ్డి తల్లడిల్లిపోయాడు.

అది ఏపీ ఫైబర్ నెట్ డ్రోన్

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరిలోని డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంపై రెండు రోజుల క్రితం డ్రోన్ కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో సోమవారం అడిషనల్ ఎస్పీ రవికుమార్ క్లారిటీ ఇచ్చారు. డ్రోన్ ఏపీ ఫైబర్ నెట్‌కు చెందినదిగా గుర్తించినట్లు తెలిపారు. మంగళగిరి ప్రాంతంలో ట్రాఫిక్, శానిటేషన్, రోడ్ల అంశాలపై పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఫైబర్ నెట్ అధికారులు డ్రోన్ ఎగురవేసినట్లు తెలిపారు. ఆ ఒక్కరోజే కాదని, గత మూడు రోజులుగా ఆ డ్రోన్ ఎగురవేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ అధికారులతో చర్చించాకే ఈ నిర్ధారణకు వచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



పట్నంబజారు : లారీ ఢీకొనడంతో 11 విద్యుత్ స్తంభాలు పడిపోయిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కమలా కాయల లోడుతో సోమవారం ఉదయం గుంటూరు నగరంలోని లాలాపేట ప్రాంతానికి లారీ వచ్చింది. లాలాపేట పోలీసు స్టేషన్ సమీపంలో ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద వెనక్కు టర్నింగ్ తీసుకున్న సమయంలో డ్రైవర్ గమనించకపోవడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో 11 స్తంభాలు నేలకు ఒరగడంతో ఆ ప్రాంతమంతా అంధకారం ఏర్పడింది. విద్యుత్ అధికారుల ఫిర్యాదులో రూ. 3 లక్షలు నష్టం వాటిల్లిందని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరించే క్రమంలో అధికారు లు ఉన్నారు. జన సంచారం లేకపోవడంతో ప్రమా దం తప్పింది. విద్యుత్ తీగలు ఎక్కడిక్కడ తెగిపోయి పడడంతో సరఫరాను నిలిపి వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

- వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు
- మల్కాపురం, బోరుపాలెం నాయకులు, కార్యకర్తల సమ్మేళనం

మల్కాపురం(తాడికొండ): పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం తప్పక ఉంటుందని వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు భరోసానిచ్చారు. తుళ్లూరు మండలం మల్కాపురం, బోరుపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమ్మేళం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలు, నాయకులే పునాదులన్నారు. వారికి కష్టం కలిగితే వెన్నంటే ఉండి అండగా నిలుస్తానన్నారు. ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. లోపాలను ఎండగట్టాలన్నారు. కార్యకర్తలకు తాను నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. సమస్యలు, ఇబ్బందులు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పార్టీ మీజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరిరావు, నాయుడు నాగేశ్వరరావు, డీజే శ్రీనివాసరావు, బోరుపాలెం నాయకులు చనుమోలు రామారావు, తోకల రాఘవ, వసంతరావు, అర్లయ్య, మల్కాపురం నాయకులు పొన్నెం సురేష్, గోచిపాత నాగేశ్వరరావు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలు



పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి పీర్ అహ్మద్

ఫిరంగిపురం: ఫిరంగిపురం, నుదురుపాడు పశు వైద్యశాలల పరిధిలోని రేపూడి, గొల్లపాలెం గ్రామాల్లో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు పశు వైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. పశువులకు వైద్య పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ నిర్వహించారు. రేపూడిగ్రామంలో 32, గొల్లపాలెంలో 65 పశువులకు డీవార్మింగ్ అందజేసినట్లు పీర్ అహ్మద్ చెప్పారు.

నేటి నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

తాడికొండ: మండలంలో మంగళవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ రాయప్ప రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ఫణిదం, నిడుముక్కల, 22న లాం, 23న గరికపాడు, లచ్చన్న గుడిపూడి, 24న పొన్నెకల్లు, ముక్కామల, 25న దామరపల్లి, పాములపాడు, 27న బేజాతపురం, 28న తాతిరెడ్డి పాలెం, రావెల, 29న బండారుపల్లి, మోతడక 30న కంతేరు, 31న తాడికొండలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గంలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ సులోచన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది జులై నాటికి 21 ఏళ్లు నిండిన 35 సంవత్సరాలు దాటని, 7వ తరగతి ఉత్తీర్ణులు అర్హులని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అర్హత వయస్సు 21 లేదా 18 సంవత్సరాలు ఉండొచ్చని తెలిపారు. జనన ధ్రువీకరణ, విద్యార్హత పత్రాలను దరఖాస్తుతో జతపర్చాలని పేర్కొన్నారు. వితంతువులైతే వారి సంతానం 18ఏళ్లలోపు నిండి ఉన్న దరఖాస్తును జతపర్చాలని తెలిపారు. మంగళగిరి సీడీపీలో కార్యాలయంలో ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఖాళీలను పరిశీలిస్తే.. ఉండవల్లి-2 (బీసీ-ఏ), చినకాకాని-4 (జనరల్), ఉండవల్లి-6(జనరల్), ఈమని-4 (జనరల్), పెదవడ్లపూడి-5 (బీసీ-బి), పెనుమాక-7 (జనరల్), చిలువూరు-6(బీసీ-ఈ) పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

తాడికొండ: ఫిరంగిపురం ఐసీడీఎస్ పరిధిలోని తాడికొండ, ఫిరంగిపురం, తుళ్లూరు, మేడికొండూరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పీపీజీ ప్రసూన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయకుల పోస్టుల ఖాళీలు పరిశీలిస్తే..

- ఫిరంగిపురం మండలంలో.. గుండాలపాడు -1(బీసీ-ఈ), ఫిరంగిపురం- 3వ వార్డు(ఓసీ), నుదురుపాడు లేరమ్మ సెంటర్(ఓసీ), మేరికపూడి(ఎస్సీ), పాలడుగు(ఎస్టీ), ఫిరంగిపురం 7వ వార్డు((ఎస్టీ), పొనుగుపాడు (ఎస్టీ).
- మేడికొండూరు మండలంలో.. కొర్రపాడు(ఎస్టీ), తుళ్లూరు మండలంలో మందడం-3(ఓసీ), మందడం-1 (ఎస్సీ), పొట్లపాడు(ఓసీ), వెలవర్తిపాడు (ఓసీ).
- తాడికొండ మండలం ముక్కామల(బీసీ-డీ), తాడికొండ 16(ఓసీ), పొన్నెకల్లు 6 (బీసీ-ఈ), తాడికొండ-1(బీసీ-ఈ), బండారుపల్లి-3(ఎస్టీ).
- తుళ్ళూరు మండలం నేలపాడు(ఎస్సీ), మల్కాపురం-1 (ఎస్సీ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తల పోస్టులు..

- అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు తాడికొండ మండలం గరికపాడు(ఎస్సీ), తుళ్లూరు మండలం వెంకటపాలెం-2 (బీసీ-డీ), ఫిరంగిపురం మండలం గుండాలపాడు(బీసీ-ఈ) ఖాళీలున్నాయి. అభ్యర్థులు ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను ఫిరంగిపురంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.


నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీఐటీ ఏపీ, ఐఐటీ చెన్నై ప్రముఖులు

తాడికొండ: నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించడం, పరిశోధన సహకారాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయం, ఐఐటీ చెన్నై మధ్య అవగాహనా ఒప్పందం కుదిరిందని వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయం వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి తెలిపారు. సోమవారం గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ రఘునాథన్ రంగనాథన్ రంగస్వామితో మొదటి ఒప్పందం జరిగిందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చెన్నై నేతృత్వంలోని ప్రతిష్టాత్మక ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవరేనెస్ ప్రాజెక్టు కింద వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయాన్ని స్పోక్ ఇనిస్టిట్యూట్‌గా గుర్తిస్తూ 2వ అవగాహనా ఒప్పందం జరిగినట్లు తెలిపారు. ఈ మేరకు వీఐటీ ఏపీ వీసీ డాక్టర్ ఎస్వీ కోటరెడ్డి, ఐఐటీ చెన్నై ఐసీఎస్ఆర్ డీన్ డాక్టర్ మను సంతానం సంతకం చేశారు. ఈ సందర్భంగా వీఐటీ- ఏపీ వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందాల వల్ల వీఐటీ- ఏపీ వర్శిటీ కీర్తి మరింత పెరుగుతుందని, దీని ద్వారా ఇరు సంస్థల మధ్య జ్ఞాన మార్పిడికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రముఖులు, వీఐటీ- ఏపీ వర్శిటీకి చెందిన డాక్టర్ అమిత్ చవాన్, డాక్టర్ సుధాకర్ ఇలంగో, డాక్టర్ శివి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.36 కోట్లు ముళ్ల కంపకు సమర్పణం



తాడికొండ: ఏపీ సీఆర్డీయే పరిధిలోని రాజధాని 29 గ్రామాల్లో పెరిగిన కంప చెట్లను కూటమి ప్రభుత్వం రూ.36.50 కోట్లు వెచ్చించి తొలగించింది. కానీ తొలగించిన ముళ్ల కంపను తగలబెట్టడం లేదా, ఓ మూలకు చేర్చడం చేయలేదు. దీంతో ఎక్కడ ముళ్ల కంప అక్కడే కుప్పలుగా ఉంది. అక్కడ పిచ్చి మొక్కలు పెరిగి అల్లుకుపోతూ మళ్లీ పొదలుగా దర్శనమిస్తున్నాయి. గతేడాది ఆగస్టు 7న జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించి, అరకొరగా పూర్తి చేశారు. అధికారులు స్పందించి ముళ్లకంపను తొలగించి, పిచ్చిమొక్కలకు ఆవాసంగా మారకుండా చర్యలు తీసుకోవాలని రాజధాని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

